క్లుప్తంగా

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

త్రిపురారం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని నిడమనూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కామర్ల జానయ్య అన్నారు. మండలంలోని అన్నారం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నర్సింగ్ సత్తయ్య రూ.8వేల ఆర్థిక సహకారంతో సోమవారం ఆయన క్రీడా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ధూళిపాల రామచంద్రయ్య, కోడిరెక్క నర్సయ్య, యూత్ అధ్యక్షుడు బుర్రి సతీష్‌యాదవ్, దశరథ, గోలి లక్ష్మీనారాయణ, అంగరాజు కోటేష్, గొర్ల అనిల్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

మిర్యాలగూడ అర్బన్: మాదిగ ఉపకులాలకు న్యాయం జరగాలంటే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధికార ప్రతినిధి మొండికత్తి లింగయ్య అన్నారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎన్ఎస్‌పీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సంఘం నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని మాట ఇచ్చి తప్పిందని, బీజేపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధిచెప్పాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బట్టు శ్రీకాంత్, రేపూరి గురువయ్య, నరేందర్, సరిపల్లి గోపి, కోట నాగేందర్, అల్లంపల్లి బాబు తదితరులున్నారు.

బీఎల్ఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



బీఎల్ఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మిర్యాలగూడ అర్బన్: పట్టణంలోని 22వ వార్డు పరిధిలోని హనుమాన్‌పేట వద్ద సోమవారం కాంగ్రెస్ పార్టీ వార్డు ఇన్‌చార్జి పగిడిమర్రి గోవర్ధన్‌చారి ఆధ్వర్యంలో పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి(బీఎల్ఆర్) చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సుకన్య సమృద్ధి యోజన కింద మిర్యాలగూడ నియోజకవర్గంలోని 10ఏళ్ల లోపు ఆడపిల్లల పేరిట బ్యాంక్ అకౌంట్లు తెరిచి ప్రతి నెలా ఖాతాల్లో రూ.250 వేస్తానని బీఎల్ఆర్ ప్రకటించడం హర్షణీయమన్నారు.

రైతుల శ్రేయస్సుకు పాటుపడదాం



మాట్లాడుతున్న మార్కెట్ చైర్మన్ చంద్రారెడ్డి

నిడమనూరు: రైతుల శ్రేయస్సుకు పాటుపడదాం అని నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ సమావేశ మందిరంలో సోమవారం మార్కెట్ పాలక మండలి మొదటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్ యార్డు పరిధిలో రైతులకు మేలు జరిగేలా, అదేవిధంగా మార్కెట్‌కు ఆదాయం పెంచేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి వేణు, వైస్ చైర్మన్ మెరుగు రామలింగయ్య, డైరెక్టర్లు సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఏర్పాట్లు చేయాలి

మిర్యాలగూడ: మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆలయాల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా చూడాలని మిర్యాలగూడ ఆర్డీఓ చెన్నయ్య అధికారులకు సూచించారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. దామరచర్ల మండలం వాడపల్లిలోని కృష్ణా, మూసీ సంగమం వద్ద పుణ్య స్నానాలు ఆచరించేందుకు భక్తులు వేలాదిగా వస్తారని, అదేవిధంగా శ్రీమీనాక్షి అగస్త్యేశ్వరస్వామి ఆలయం, లక్ష్మీనరసింహస్వామి ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో వస్తారన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో దామరచర్ల తహసీల్దార్ ఖదీర్, ఎంపీడీఓ మూర్తి, రూరల్ సీఐ సత్యనారాయణతో పాటు ఫైర్, ఆర్టీసీ, ఫిషరీస్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులు, ఆలయ కమిటీ చైర్మన్లు, పెన్నా, ఇండియా సిమెంట్స్ యాజమాన్యాలు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ చెన్నయ్య

అపరిశుభ్రంగా ఏరియా ఆస్పత్రి

- పారిశుద్ధ్య నిర్వహణ లోపంతో రోగుల ఇబ్బందులు
- అధ్వానంగా వాష్‌రూంలు
- పట్టించుకోని వైద్యాధికారులు



అపరిశుభ్రంగా ఉన్న అవుట్ పేషెంట్ విభాగంలోని బాత్‌రూం



ఆస్పత్రి లోపల చెత్తబుట్ట పక్కన పడేసిన వ్యర్థాలు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో పారిశుద్ధ్య లేమి కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఓపీ విభాగం సమీపంలో ఉన్న వాష్‌రూం నుంచి వచ్చే దుర్వాసనతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ వాష్‌రూం నూతనంగా నిర్మించినప్పటికీ అందులోని పైపులు విరిగిపోవడంతో దుర్గంధం వెదజల్లుతుంది. కనీసం ఓపీ విభాగంలో చూసే వైద్యులు కూడా పట్టించుకోవడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోగం తగ్గేందుకు ఆస్పత్రికి వస్తే.. ఈ దుర్వాసనతో ఉన్న రోగం పోవడం దేవుడెరుగు కానీ కొత్త రోగాలు వస్తాయేమోనని రోగులు పేర్కొంటున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణకు 18మంది..

కాగా ఆస్పత్రిలో పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు 18మందిని నియమించిన వైద్యాధికారులు, కనీస చర్యలు చేపట్టకపోవడం రోగులను విస్మయానికి గురిచేస్తుంది. రోగుల వార్డులోనూ వాష్‌రూంలు కంపుకొడుతున్నాయి. ఆస్పత్రిని శుభ్రం చేసేందుకు నాసిరకం ఫినాయిల్ వాడుతున్నారని, ఒక్కోసారి ఫినాయిల్ లేకుండానే ఆస్పత్రిని శుభ్రం చేస్తున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రిలో పారిశుద్ధ్యాన్ని పరిశీలించాల్సిన వైద్యాధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీనికి తోడు ఆస్పత్రి ఆవరణలో రోగులకు ఉపయోగించిన సిరంజీలు, గాయాలను శుభ్రం చేసిన దూది, కట్లు కట్టిన పట్టీలు, వైద్యులు ఉపయోగించిన గ్లౌజ్‌లు ఎక్కడ పడితే పడేస్తున్నారు.

ఇబ్బంది లేకుండా చేస్తాం



రోగులకు ఇబ్బంది లేకుండా చూస్తాం. నూతనంగా ఏర్పాటు చేసిన వాష్‌రూంలో పైపులు ఊడిన విషయం నా దృష్టికి రాలేదు. వెంటనే సిబ్బందితో మాట్లాడి దుర్వాసన రాకుండా చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాస సమరథ్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, మిర్యాలగూడ

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్



ఎర్రగుంటపల్లిలోని ప్రాథమిక పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

డిండి: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.20.66 లక్షలతో అభివృద్ధి చేసిన మండల పరిధిలోని ఎర్రగుంటపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామంలో రూ.25 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు మౌలిక వసతులు కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కనీసం మట్టిరోడ్డుకు కూడా నోచుకోని పల్లెలను నూతన గ్రామపంచాయతీలుగా మార్చి ప్రతి వీధిలో సీసీ రోడ్డు, డ్రెయినేజీలు నిర్మిస్తున్న బీఆర్ఎస్ పాలనకు గ్రామీణ ప్రాంతాల ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ప్రజా సంక్షేమాన్ని కోరుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై రోజురోజుకు బీఆర్ఎస్‌లో చేరికలు పెరుగుతున్నాయన్నారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన పలువురికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజీనేని వెంకటేశ్వరరావు, సర్పంచ్ పేట రాధ, పీఏసీఎస్ చైర్మన్‌లు నాగార్జున్‌రెడ్డి, శ్రీనివాసారావు, యూత్ మండల అధ్యక్షుడు మల్‌రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు గోలి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్‌రావు, భగవంతరావు, భాస్కర్‌రెడ్డి, కాశన్న, ఖలీం, సురేష్, బొడ్డుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

పెద్దఅడిశర్లపల్లి: మండల పరిధిలోని కోదండాపురం గ్రామంలో గల పద్మావతి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ ప్రాంగణంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవంలో దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌తో పాటు 900 జంటలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ముచ్చర్ల ఏడుకొండలుయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ వల్లపురెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నర్సింహ, తోటకూరి పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ తల్లి జాతర



బోనాలతో తరలివస్తున్న మహిళలు

నిడమనూరు: మండలంలోని రాజన్నగూడెంలో సోమవారం గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. యాదవుల ఇష్ట దైవమైన గంగమ్మ తల్లి జాతరను గ్రామస్తులు ప్రతి ఐదేళ్లకు ఒకసారి నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా గ్రామంలోని పెద్దగొల్ల ఆడపడుచు, ఎర్రగొల్ల, పూజగొల్ల ఆడపడుచులతో పాటు ఇతర యాదవ ఆడపడుచులు గంగమ్మ తల్లికి మంద గంపతో బోనాలు సమర్పించారు. యాదవులు మల్లన్న వేషధారణలో ఆడిపాడారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి జాతరకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మండలి రామకృష్ణ, ఆలయ పూజారి కొండయ్య, సర్పంచ్ ముంగి జ్యోశివమారయ్య, మాజీ సర్పంచ్ మండలి సునీతరవికుమార్, జంగిలి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పాడి పశువులకు బ్రూసెల్లోసిస్ వ్యాక్సిన్ వేయించాలి

పెద్దవూర: పాడి పశువులకు రైతులు తప్పనిసరిగా బ్రూసెల్లోసిస్ వ్యాక్సిన్ వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ చంద్రబాబు సూచించారు. సోమవారం మండలంలోని పోతునూరులో పాడి పశువులకు ఆయన బ్రూసెల్లోసిస్ వ్యాక్సిన్ వేసి మాట్లాడారు. 4 నుంచి 8 నెలల మధ్య వయస్సు ఉన్న ఆవు, గేదెల ఆడ దూడలకు మాత్రమే ఈ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. తద్వారా భవిష్యత్‌లో పునరుత్పత్తి సమయంలో గర్భస్రావం కాకుండా ఉంటుందని తెలిపారు. ఇప్పటివరకు మండలంలో 620 ఆడ దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాక్సిన్ వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గోపాలమిత్రలు గాలి లింగారెడ్డి, కొట్టె జానీ, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి 24గంటల విద్యుత్ అందించాలి



విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మిర్యాలగూడ: వ్యవసాయానికి 24గంటల విద్యుత్ అందిస్తున్నామని బీఆర్ఎస్ ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా, కనీసం ఐదారు గంటలు కూడా రావడం లేదని కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గాలం వెంకన్నయాదవ్ ఆరోపించారు. వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యుత్ ఏఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ కోతలతో పంట పొలాలు ఎండిపోయే స్థితికి వచ్చాయన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి కరెంట్ సరఫరా ఉండగా వారికి ప్రభుత్వం బకాయిలు చెల్లించడంలో విఫలమైందని, వెంటనే బకాయిలు చెల్లించి రైతులకు 24గంటల విద్యుత్‌ను అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు అంజిరెడ్డి, కిరణ్, నాయకులు సిద్ధునాయక్, రవితేజ, సదానందం, వెంకటేశ్వర్లు, దుర్గాప్రసాద్, చెన్నయ్య, నాగయ్య, శ్రీను, కోటిరెడ్డి, కిషన్ నాయక్, రవి, వంశీ, నాగు, హుస్సేన్, వేణు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘం డైరెక్టర్ల ఎన్నిక

మిర్యాలగూడ: వేములపల్లి మండలంలోని ఆమనగల్లు వూర చెరువు మత్స్య సహకార సంఘం డైరెక్టర్ల ఎన్నికను సోమవారం నిర్వహించారు. మొత్తం 9 డైరెక్టర్ స్థానాలకు గాను 22 మంది పోటీపడ్డారు. 182 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల అధికారి కె. సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఓట్ల లెక్కింపు చేపట్టగా మద్దెబోయిన పెద వెంకన్న, చింతకాయల వీరేందర్, చెన్నబోయిన శ్రీను, ఉత్తెర్ల జానకిరాములు, మద్దెబోయిన చిన వెంకటయ్య పేరబోయిన ఆంజనేయులు, మారిపెద్ది సైదమ్మ, ఉత్తెర్ల వెంకన్న,మద్దెబోయిన నాగమ్మలు డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. వీరందరూ కలిసి బుధవారం అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకోనున్నారు. కాగా ఎన్నికలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ శ్రీనివాస్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎన్నికల ప్రొసీడింగ్ అధికారి విజయ్‌కృష్ణ, శ్యామ్‌కుమార్, ఎండీ అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన

పెద్దఅడిశర్లపల్లి: మండలంలోని గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ జెడ్పీ ఫ్లోర్ లీడర్, పెద్దఅడిశర్లపల్లి జెడ్పీటీసీ అలుగుబెల్లి శోభారాణి అన్నారు. సోమవారం మండలంలోని అంగడిపేటలో డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడారు. అనంతరం కోదండాపురం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఏవీరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎల్లయ్య, బోడ్యానాయక్ తదితరులున్నారు.



డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కాంగ్రెస్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ శోభారాణి

కేసీఆర్ ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదు



మిర్యాలగూడ: వేములపల్లిలో మాట్లాడుతున్న మిర్యాలగూడ నియోజకవర్గ పాలక్ కవిత

మిర్యాలగూడ: గత ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజలను మోసం చేశాడని బీజేపీ మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ పాలక్ అన్నారు. సోమవారం వేములపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా గోస– బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిని దళితుడిని చేస్తానని, దళితులకు మూడెకరాల భూమి అందిస్తానని చెప్పి కేసీఆర్ దళితులను మోసం చేశాడన్నారు. ఎనమిదేళ్లుగా రాష్ట్రాన్ని దోచుకున్న కేసీఆర్ ఇప్పుడు బీఆర్ఎస్ పేరుతో దేశాన్ని దోచుకోవడానికి బయల్దేరాడన్నారు. స్థానిక ఎమ్మెల్యే భాస్కర్‌రావు తాము వేసిన రోడ్లపై వెళ్లొద్దని, నీళ్లను తాగొద్దని ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చిర్ర సాంబమూర్తి, పందిరి రాజేష్, పందిరి భాగ్యమ్మ, పుట్టల సందీప్, జవ్వాజి సత్యనారాయణ పాల్గొన్నారు.

కేంద్ర నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి

మిర్యాలగూడ అర్బన్: కేంద్రం నిధులతో తెలంగాణలో అభివృద్ధి పనులు జరుగుతుందటే, బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం తామే రాష్ట్రాన్ని అభివృద్ధి చేసినట్లు ప్రజలను మభ్యపెడుతున్నారని బీజేపీ మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ పాలక్ కవిత అన్నారు. ఆదివారం రాత్రి మిర్యాలగూడ మండలంలోని అవంతీపురం, ఆలగడప గ్రామాల్లో ప్రజా గోస–బీజేపీ భరోసా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీసీ రోడ్లు, రైతు వేదికలు, డంపింగ్ యార్డులు, వైకుంఠధామాల నిర్మాణాలతో పాటు గ్రామపంచాయతీల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు సిదినేని శ్రీనివాస్‌రావు, రేపాల పురుషోత్తంరెడ్డి, కొండేటి సరిత, దొండపాటి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న డబ్బికార్ మల్లేష్

మిర్యాలగూడ అర్బన్: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ పిలుపునిచ్చారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా 10లక్షల మంది కార్మికులు హాజరవుతున్న ఈ కార్యక్రమానికి కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, తిరుపతి రామ్మూర్తి, మంగారెడ్డి, రామచంద్రు, వాడపల్లి రమేష్, లక్ష్మీనారయణ, చౌగాని వెంకన్న, చాంద్‌పాషా తదితరులున్నారు.

పాడి రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు



ఆలగడప పీహెచ్‌సీలో రోగులకు మందులు అందజేస్తున్న తిప్పన విజయసింహారెడ్డి

మిర్యాలగూడ: రాష్ట్రంలోని పాడి రైతులను తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించి ఆదుకుంటుందని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి అన్నారు. మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో సోమవారం ఆయన పశువైద్య శిబిరాన్ని ప్రారంభించి పాడి రైతులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ నూకల సరళ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ధనావత్ చిట్టిబాబునాయక్, స్థానిక సర్పంచ్ దుండిగల యాదమ్మ, పీఏసీఎస్ చైర్మన్ వెలిశెట్టి రామకృష్ణ, నాయకులు, పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.

బీపీ, షుగర్ మందులు అందజేత..

మండలంలోని ఆలగడప పీహెచ్‌సీలో సోమవారం బీపీ, షుగర్ రోగులకు తిప్పన విజయసింహారెడ్డి మందులు అందజేసి మాట్లాడారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సీఎం కేసీఆర్ అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మట్టపల్లి సైదులు, చామర్తి వెంకటేశ్వర్లు, చెదురుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



యాద్గార్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎంఈఓ బాలాజీనాయక్



పెద్దవూర: విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసిన దాత సుధీర్‌కుమార్ తదితరులు

మిర్యాలగూడ: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రోత్సహించడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎంఈఓ బాలాజీ నాయక్ అన్నారు. మండలంలోని యాద్గార్‌పల్లి జెడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థులకు పెరుమాళ్ల లలితాఅంజయ్య సమకూర్చిన రూ.14వేల విలువైన స్టడీ మెటీరియల్‌ను సోమవారం ఆయన అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోల శ్రీనివాస్, దాత మల్ల లలిత, టీచర్లు పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలోని మాల్ వెంకటేశ్వరనగర్, వింజమూరు జెడ్పీహెచ్ఎస్‌లోని పదో తరగతి విద్యార్థులకు సోమవారం పీఆర్ఆర్, కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంపీపీ కొండూరు భవాని స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీదేవి, చల్లా పాండురంగారావు, కస్తూరి చరణ్, జంగయ్య, రాజేశ్, మంజునాథ్ పాల్గొన్నారు.

పెద్దవూర: మండలంలోని పులిచర్ల జెడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థులకు గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి బిక్కుమండ్ల సుధీర్‌కుమార్ తన సొంత ఖర్చులతో అందించిన స్టడీ మెటీరియల్‌ను సోమవారం కాంప్లెక్స్ హెచ్‌ఎం సుదర్శన్ పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో సరస్వతి విగ్రహాన్ని ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి బిక్కుమళ్ల సుధీర్‌కుమార్, ఉప సర్పంచ్ బొడ్డుపల్లి చిరంజీవి, శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ, పీజీ తరగతుల నిర్వహణకు కృషిచేస్తా



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ: రాష్ట్రంలోని గిరిజన గురుకుల పాఠశాలల్లో రానున్న రోజుల్లో డిగ్రీ, పీజీ తరగతుల నిర్వహణకు తన వంతు కృషిచేస్తానని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి నిర్వహించిన మండలంలోని అవంతీపురంలో గల గిరిజన గురుకుల పాఠశాల సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పేద గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలన్న లక్ష్యంతో 1997లో 40ఎకరాల విస్తీర్ణంలో పాఠశాలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. అనంతరం ఇంటర్మీడియట్‌గా అప్‌గ్రేడ్ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే డిగ్రీ, పీజీ కూడా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానన్నారు. ఈ కళాశాలలో చదివిన ఎంతో మంది జీవితంలో ఉన్నతస్థానాల్లో స్థిరపడ్డారని అన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్స్ వెంకటనర్సయ్య, కొండిన్య సాయి, జనార్దన్‌రెడ్డి, వి. శ్రీనివాస్‌రావు, వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, సీనియర్ అసిస్టెంట్ ధీకొండ ప్రసాద్, ఉపాధ్యాయులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించాలి

దేవరకొండ: బీసీలకు జనాభా దామాషా ప్రకారం రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం నిధులు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పున్న శైలజ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ప్రధాన రహదారిపై బడ్జెట్ జిరాక్స్ ప్రతులను ఆమె దహనం చేసి మాట్లాడారు. బడ్జెట్‌లో బీసీలకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని ఆరోపించారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుర్రం విజయలక్ష్మి, మోర శ్రీదేవి, మాకం సువర్ణ, దొరోజు విజయ, నీలం సరిత, నేతాళ్ల వెంకటేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

శ్రీశైలం దేవస్థానానికి ప్రత్యేక బస్సులు

దేవరకొండ: మహాశివరాత్రిని పురస్కరించుకొని దేవరకొండ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో శ్రీశైలం దేవస్థానానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ రాజీవ్ ప్రేమ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేవరకొండ బస్టాండ్ నుంచి 17, 19 తేదీల్లో ప్రయాణికుల రద్దీ మేరకు, 18వ తేదీన ప్రతి గంటకు ఒక బస్సు చొప్పున శ్రీశైలానికి నడుపుతున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆర్టీసీ రాయితీ సద్వినియోగం చేసుకోవాలి

మిర్యాలగూడ అర్బన్: పెళ్లిళ్లు, శుభకార్యాలు, దేవాలయాల సందర్శనార్థం ఆర్టీసీ బస్సులను 10శాతం రాయితో అద్దెకు ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మిర్యాలగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ పాల్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిసెంబర్ 31తో ముగిసిన ఈ రాయితీని తిరిగి ప్రారంభించినట్లు తెలిపారు. వివరాలకు డిపోలో సంప్రదించాలని సూచించారు.

దేవాలయ భూములకు కౌలు వేలం

మిర్యాలగూడ: వేములపల్లి మండలంలోని ఆమనగల్లులో గల శ్రీపార్వతీ రామలింగేశ్వరస్వామి దేవాలయ భూములకు సోమవారం కౌలు వేలం నిర్వహించారు. ఆలయ పరిధిలో సుమారు 38ఎకరాల భూమి ఉండగా పది ఎకరాలకు రైతులు రూ.1.72లక్షలతో కౌలుకు దక్కించుకున్నారు. కాగా మిగిలిన 28 ఎకరాల భూమికి సంబంధించి కౌలు వేలం పాడేందుకు రైతులు ముందుకు రాకపోవడంతో వేలం తేదీని తిరిగి ప్రకటిస్తామని ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ పరిశీలకుడు రమేష్, దేవాలయ ఈఓ మృత్యుంజయశాస్త్రి, విఠల్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కోల పాపయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని శ్రీరాంపల్లి గ్రామానికి చెందిన అనుముల సైదయ్య అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. ఎమ్మెల్సీ కోటిరెడ్డి గ్రామానికి చేరుకుని సైదయ్య మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట అల్లి పెద్దిరాజుయాదవ్, వజ్జ ప్రసాద్ ఉన్నారు.

బుడబుక్కల కులస్తులకు ఇళ్లు ఇవ్వాలి

మిర్యాలగూడ అర్బన్: బుడబుక్కల కులస్తులకు ప్రభుత్వం పక్కా ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తెలంగాణ కులాల, తెగల సమాఖ్య జిల్లా కన్వీనర్ వజ్రగిరి అంజయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని బుడబుక్కల కులస్తుల నివాసాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. సంచార తెగకు చెందిన వీరికి పింఛన్లు లేవని, రేషన్ రావడంలేదని, గత 40ఏళ్లుగా బంధం వాగు వెంట గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని అన్నారు. వీరి సమస్యలపై త్వరలో జిల్లా కలెక్టర్‌ను కలుస్తామని పేర్కొన్నారు.

నేటి నుంచి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు

పెద్దవూర: మండలంలోని చింతపల్లి గ్రామంలో శ్రీశ్రీ దున్న ఇద్దాస్ ఆరాధనోత్సవాలలో భాగంగా మహా శివరాత్రి సందర్భంగా మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జాతీయ స్థాయి మహిళల కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ చైర్మన్ షేక్ అబ్బాస్ తెలిపారు. ఈ పోటీల్లో 18 రాష్ట్రాలకు చెందిన జట్లు పాల్గొంటాయని అన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

కొండమల్లేపల్లి: కేంద్రం ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలు సోమవారం జాతీయ రహదారుల దిగ్బంధనానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో మండలంలోని ఎమ్మార్పీఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అందుగుల తిరుపతయ్య, వస్కుల విజయ్, కోటయ్య, మల్లయ్య, సైదులు పాల్గొన్నారు.

దివ్యాంగ క్రీడాకారుడికి క్రికెట్‌కిట్ అందజేత

త్రిపురారం: మండలంలోని మాటూరు గ్రామపంచాయతీకి చెందిన దివ్యాంగ క్రీడాకారుడు వస్రాం కేరళ రాష్ట్రంలో జరగనున్న దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడు. వస్రాం ఆర్థిక పరిస్థితి గురించి తెలుసుకున్న బంజారా మహిళ ఎన్జీఓ ఫౌండర్ డాక్టర్ ఆనంద్ రూ.5 వేల విలువైన క్రికెట్ కిట్‌ను సోమవారం మండల కేంద్రంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో అతడికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు ఈసీ గోపాల్, సుజాత, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.